| ఝార్ఖండ్ | ఆదివాసులను అణచివేసే మరో పద్ధతి |
|---|---|

**2017** ఆగస్టులో ఝార్ఖండ్ శాసనసభ మతస్వేచ్ఛ బిల్లును ఆమోదించింది. దీనికి గవర్నర్ వెంటనే ఆమోదముద్ర వేశాడు. మతస్వేచ్ఛా చట్టంగా దీనిని పేర్కొంటున్నప్పటికీ, బలవంతపు మతమార్పిడులుగా చెప్పబడుతున్న వాటిని నిరోధించటానికి ఈ చట్టం ఉద్దేశించబడింది. ఝార్ఖండ్ ప్రస్తుత నేపథ్యంలో, ఈ చట్టంయొక్క లక్ష్యం, క్రిస్టియన్ ఆదివాసీ ప్రజలుగా చెబుతున్నా మొత్తంగా ఆదివాసీ ప్రజల జీవితాలపై నిజమైన దాడికి ఇది ముసుగు మాత్రమే.

బలవంతపు మతమార్పిడులను నిరోధించే లక్ష్యంతో గతంలో అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు-1967లో ఒడిషా, 1968లో మధ్యప్రదేశ్, 1978లో అరుణాచల ప్రదేశ్‌లు ఈ చట్టాలు చేశాయి. బలవంతపు మతమార్పిడుల నిషేధం పేరుతో తమిళనాడు రాష్ట్రం 1979లో చట్టం చేసినప్పటికీ 2004లో దానిని రద్దుచేసింది. మొత్తంమీద ఈ చట్టాలన్నీ తటస్థవైఖరి కలిగినవి. అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తాను చేసిన చట్టం అమలుకు అవసరమైన విధి విధానాలను రూపొందించకపోవటంవలన ఆ చట్టం ఇన్ని సంవత్సరాలుగా అమలులోనే లేదు.

అయితే 2000 సంవత్సరం తర్వాత చేసిన ఈ తరహా చట్టాలకు నిర్దిష్ట ఎజెండా వుంది. 2002లో గుజరాత్ రాష్ట్రం, 2006లో రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలు మతస్వేచ్ఛ చట్టాలను చేశాయి. ఈ రాష్ట్రాలలో అత్యధిక భాగం-భూముల పరాయీకరణ జరగకుండా ప్రత్యేకించి ఆదివాసుల ప్రయోజనాల పరిరక్షణకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు క్రిందకు వస్తాయి. మతస్వేచ్ఛ చట్టాలలో – నేరానికి పాల్పడితే బెయిల్ పొందవీలులేని కేసుతోపాటుగా కఠినమైన శిక్ష విధింపుతోపాటు మతమార్పిడి పొందాలనే వ్యక్తి ముందస్తుగా అనుమతి పొందాలనే నిబంధనలున్నాయి.

ఝార్ఖండ్ రాష్ట్రంచేసిన చట్టంలో-బాప్టిజంయొక్క సమాచారాన్ని ముందుగా జిల్లా మేజిస్ట్రేట్‌కు తెలియ జేయాలనే అంశాన్ని జోడించటంతోపాటు, బలవంతపు మతమార్పిడి నేరానికి శిక్షాకాలాన్ని – మూడు సంవత్సరాల జైలుశిక్ష, 50 వేల రూపాయల జరిమానాగా పెంపు చేశారు. 'స్థానికుల విశ్వాసాలు' అనే పదాన్ని మొదటిసారిగా ఈ చట్టంలో అసంబద్ధంగా నిర్వచించారు. పాలకులు తమ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా ఈ చట్టాన్ని ఉపయోగించుకొని, వేధింపులకు గురిచేయటానికి కావలసినంత జాగా ఈ చట్టంలో కల్పించుకున్నారు.

ఆర్ఎస్ఎస్ – బిజెపిలు మతమార్పిడులను భావోద్వేగపూరిత అంశంగా చేసి, హిందూమత విశ్వాసాలను ఆచరించేవారిలో తమ స్థానం కుచించించుకు పోతున్నదనే అభద్రతను కల్పించి, దానిని తమ రాజకీయ ఎజెండా అమలుకు సారవంతమైన భూమికగా ఉపయోగించుకుంటున్నాయి. మతమార్పిడుల అంశాన్ని ఈ శక్తులు లేవనెత్తిన ప్రతి సందర్భంలోనూ ఆదివాసీ ప్రజానీకమే వీరి లక్ష్యంగా ఉంటున్నారు. ఝార్ఖండ్‌లో ఈ చట్టం రావటం వెనకనున్న వాస్తవమిది. ఈ చట్టం చేస్తున్న సందర్భంగా రాష్ట్రప్రభుత్వం దినపత్రికలలో ఇచ్చిన పూర్తిపేజి ప్రకటన, ఆదివాసులను అణచి వేయటానికే ఈ చట్టం ఉద్దేశించబడిందని స్పష్టం చేస్తోంది. క్రిస్టియన్ సంస్థలద్వారా 'దళితుల' మరియు 'వనవాసీ'ల బలవంతపు మతమార్పిడులను ఎం.కె.గాంధీ వ్యతిరేకించారని యాదృచ్ఛికంగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ ఈ ప్రకటన ఎప్పుడు చేశాడనే దాన్ని గురించి ప్రకటనకర్తలు లక్ష్య పెట్టదలచలేదు. కానీ 'దళితులు' 'వనవాసీ'లనే పదాలు ప్రాచుర్యంలో వున్నవి కావు; కనీసం గాంధీకాలం నాటి రాజకీయ పరిభాషలోవున్న పదాలు కావు.

తమ మనుగడకు సంబంధించిన అనేక సమస్యలను ఝార్ఖండ్‌లోని ఆదివాసీ సమూహాలు ఎదుర్కొంటున్నారు. అయితే, క్రిస్టియన్ మతంలోకి మార్పిడులు అనే దాన్ని అనేకరెట్లు పెద్దది చేసి చూపుతున్నారు. ఝార్ఖండ్‌లోకి క్రిస్టియన్ మతసంస్థలు ప్రవేశించిన ఒక శతాబ్దకాలం తర్వాత కూడా, రాష్ట్రంలోని ఆదివాసీ జనాభాలో క్రిస్టియన్లు నాలుగు శాతంగా వున్నారు. క్రిస్టియన్, క్రిస్టియనేతర ఆదివాసులమధ్య అపోహలు, అభిప్రాయ బేధాలు వుండి వుండవచ్చు. ఈ గండిని మరింత పెంచాలనే ఉద్దేశ్యంతోనే పాలకులు దీనిని ఓ అత్యవసర అంశంగా ముందుకు తెచ్చి, దీనిపై ఓ చట్టాన్ని చేశారు.

ఆదివాసుల జీవితాలను అభివృద్ధిచేయాలన్న ప్రాతిపదికపై ఏర్పరచిన ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్రం, ఆ దిశగా ఫలవంతం కాలేదు. ఏనాటికీ తీరని లాభాల దాహంతోనున్న సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడిదారులకు, భారత బడాబూర్జువా వర్గానికి ఝార్ఖండ్‌ను ఓ ఆహ్లాదకర వేటభూమిగా మార్చారు. ఆదివాసుల జీవనాధారాలను ధ్వంసంచేస్తూ, వారినుండి 'జల్, జంగిల్, జమీన్' లను గుంజివేసుకుని అక్కడి అపార ఇనుప ఖనిజ వనరులను, బొగ్గుగనులను లూటీచేసి తరలించుకెళ్తున్నారు.

తమ భూమి, నీరు, అడవుల నుండి తమను దూరంచేయటాన్ని నిరసిస్తూ ఆదివాసులు సమైక్యంగా ప్రతిఘటన సాగిస్తున్నారు. మతాల తేడాలు వారి పోరాటాన్నేమాత్రం అడ్డగించలేదు. ఆదివాసులు లేవనెత్తే చట్టపర వివాదాన్ని తోసిపుచ్చేందుకే ప్రభుత్వం ఛోటానాగపూర్ టెనెన్సి యాక్ట్ – 1908 '(సిఎన్‌టి) మరియు 'సంతాల్ పరగణా టెనెన్సి యాక్ట్-1949 (ఎస్‌పిటి)'లలో సవరణలు చేసింది. ముందుగా మోసకారీ విధానాలతో ఆదివాసుల భూములను గిరిజనేతరులు స్వాధీనం చేసుకున్నారు. గిరిజనుల నుండి గిరిజనేతరులకు భూబదలాయింపును, భూపరాయీకరణను ఈ చట్టాలు నిరోధిస్తాయి. అందుకే ఈ చట్టాలలో సవరణలు చేశారు. ఈ సవరణలను వ్యతిరేకిస్తూ ఆదివాసులు ఆందోళన చేశారు. ఈ పోరాటంలో, క్రిస్టియను ఆదివాసులు ఓ ముఖ్యపాత్ర నిర్వహించారు.

క్రిస్టియను ప్రచార సంస్థల కార్యకలాపాలద్వారా, విద్యావకాశాలు అందుబాటులో వున్న కారణంగా, క్రిస్టియను ఆదివాసులు–విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో – క్రిస్టియనేతర ఆదివాసులకంటే ముందుంటారు. ఎస్.టి. రిజర్వేషన్ కారణంగానే ప్రభుత్వ సంస్థలలో క్రిస్టియను ఆదివాసులకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. దీనినే, క్రిస్టియనేతరుల నుండి వీరు ఉద్యోగావకాశాలను గుంజివేసుకుంటున్నట్లుగా చూపెడుతున్నారు. వాస్తవ మేమంటే, ఈ రోజుకి కూడా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో, ఎస్.టి. కోటాకు తగినంతమంది అభ్యర్థులు లేరు. అయినప్పటికీ పాలకవర్గ రాజకీయనేతలు ఆదివాసులను విభజించటానికి దీనిని ఉపయోగిస్తున్నారు. క్రిస్టియన్, క్రిస్టియనేతర–ఆదివాసుల నడుమ గండిని పెంచే లక్ష్యంతోనే ఆర్ఎస్ఎస్ – బిజెపిల కూటమి మరింత గగ్గోలు పెడుతోంది. అయినప్పటికీ, ఎప్పుడైతే ఆదివాసులు తమ భూములను, అడవులను కోల్పోయిన అంశం ముందుకు వస్తుందో, ఈ విభజనధిగమించి ఆదివాసులంతా చేతులు కలిపి ఉద్యమాలలో భాగస్వాములవుతున్నారు.

సరిగ్గా, ఈ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకే, ప్రభుత్వం – బడాపెట్టుబడిదారులకోసం సాగించే భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా జరిగే ఆదివాసుల పోరాటాలను బలహీనపర్చేందుకే, మతస్వేచ్ఛ చట్టం – 2017గా చెప్పబడే దానిని ముందుకు తెచ్చారని స్పష్టమౌతోంది.

ooooo